కూన వెంకటేష్‌గౌడ్ సేవలు మరువలేం



కూన వెంకటేష్‌గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కూన శ్రీనివాస్‌గౌడ్

కుత్బుల్లాపూర్: దివంగత నేత కూన వెంకటేష్‌గౌడ్ చేసిన సేవలను పలువురు కొనియాడారు. విశేష సేవలు అందించిన ఆయన ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనను స్మరిస్తూ షాపూర్ నగర్‌లో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేకేఎం ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ నేత కూన శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. వెంకటేష్‌గౌడ్ సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో కూన వెంకటేష్‌గౌడ్ సుపరిచిత నాయకుడిగా ప్రజలకు విశేష సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో రాచోటి సత్యనారాయణ గౌడ్, పలువురు నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



షాపూర్‌నగర్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం

మెడికల్ క్యాంప్ ఏర్పాటు అభినందనీయం



మెడికల్ క్యాంపులో పాల్గొన్న డీసీపీ సురేష్ కుమార్

జగద్గిరిగుట్ట : ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం అభినందనీయమని డీసీపీ సురేష్ కుమార్ అన్నారు. ఆకార్ ఆశ హాస్పిటల్ సహకారంతో బుధవారం ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. రెడ్డి ఫంక్షన్‌హాల్, పాపిరెడ్డి నగర్‌లో ఈ క్యాంపు నిర్వహించారు. పుట్టుకతో వచ్చే గ్రహణ మొర్రి, కాలిన గాయాలు, చేతులు అతుక్కొని పుట్టడం, కాళ్లు వంకరతో పుట్టడం వంటి సమస్యలు ఉన్న వారు పరీక్షించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ బారతెండు స్వాన్, జగద్గిరిగుట్ట సీఐ క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నేతలు

దుండిగల్: పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలో బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా బౌరంపేట సింహపురి కాలనీలోని ఏ బ్లాక్ పార్కు స్థలంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు ఎస్ మల్లారెడ్డి, జిల్లా కోశాధికారి కృష్ణారెడ్డి, డి ప్రభాకర్ రెడ్డి, ప్రమోద్ కుమార్, సీతారాంరెడ్డి, సర్గారి సత్తిరెడ్డి, రాజేశ్వర్, విజయ్ కృష్ణమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బౌరంపేట సింహపూరి కాలనీలో మొక్కలు నాటుతున్న నేతలు

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



సమస్యలు తెలుసుకుంటున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్యగౌడ్

జగద్గిరిగుట్ట : ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను ఆర్థికంగా ఆదుకోవాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్యగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్‌లోని వివిధ భవన నిర్మాణ కార్మికుల అడ్డాలను బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్యగౌడ్, నియోజకవర్గ అధ్యక్షులు ఎం జనార్థన్ బృందం పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాల వల్ల భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేక పస్తులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ కార్డు ఉన్న కార్మికులకు ఆర్థికసాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రోడ్డు వైడింగ్ పేరుతో 30 సంవత్సరాల నుంచి షాపూర్ నగర్‌లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల అడ్డాలను తొలగించడం దారుణమని, వీరికి ప్రత్యామ్నాయం చూపించాలని కోరారు. త్వరలో సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు చంద్రయ్య, మొగులయ్య, ఆరోగ్య రెడ్డి, యాదగిరి, కమలమ్మ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం తగదు

సుభాష్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. కురిసిన వర్షాలకు గాజులరామారం రావినారాయణరెడ్డి నగర్‌లోకి వరదనీరు ప్రవేశించి రోజుల తరబడి నిల్వ ఉంది. దీంతో వాహనదారులు ఇబ్బందులను గమనించి కాలనీ వాసులతో కలిసి బుధవారం రోడ్డును శుభ్రం చేసి వరద నీటిని మళ్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డుపై వరద నీటి నిల్వ గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని విస్మయం వ్యక్తం చేశారు. ఉప కమిషనర్ మల్లారెడ్డి సమస్యను పరిశీలించినా.. ఇంత వరకు చర్యలు చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు శ్రీనివాస్, శ్రీహరి, స్వామి, వరలక్ష్మి, మాధవి, ప్రమీల, శోభ పాల్గొన్నారు.



వరద నీటిని మళ్లిస్తున్న బస్తీ వాసులు

ఐఐఎం లక్నో-టాలెంట్ స్ప్రింట్ ఆధ్వర్యంలో కొత్త కోర్సు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని టాలెంట్‌స్ప్రింట్-ఐఐఎం లక్నో కలిసి సేల్స్, మార్కెటింగ్‌లో ఎగ్జిక్యూటివ్ కోర్సును బుధవారం ప్రారంభించారు. ఆధునిక వ్యూహాలతో ప్రొఫెషనల్స్‌ను శక్తివంతం చేయడమే లక్ష్యంగా సాగుతున్నారు. ఈ సందర్భంగా ఐఐఎం లక్నో మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ చైర్మన్ ప్రొఫెసర్ సబ్యాసాచిసిన్హా మాట్లాడుతూ ఎగ్జిక్యూటివ్‌లకు అనుకూలంగా వీకెండ్ క్లాసులు ఉంటాయన్నారు. టాలెంట్ స్ప్రింట్ వ్యవస్థాపక సీఈఓ ఎండీ డాక్టర్ శంతనుపాల్ మాట్లాడుతూ ఈ కోర్సు సేల్స్, మార్కెటింగ్‌లో డిజిటల్ పరిసరాలను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో సహాయపడుతుందన్నారు. ఐఐఎం లక్నో క్యాంపస్‌ను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు అవకాశం ఉంటుందన్నారు.కోర్సు పూర్తయిన తర్వాత సర్టిఫికెట్ అందిస్తామన్నారు.

వక్ఫ్‌బోర్డు స్థలం ఉందంటూ ఉత్తర్వులు..

నిలిచిన రిజిస్ట్రేషన్లు!

- సర్వే నం.58 నుంచి 226 వరకు రిజిస్ట్రేషన్ల నిలిపివేత
- సర్వే ముగించి రిజిస్ట్రేషన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్



సూరారంలోని కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనం

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ టౌన్ పరిధిలో అక్కడక్కడ వక్ఫ్‌బోర్డు స్థలం(ఎకరం ఒక గుంట) ఉందంటూ మూడు రోజులుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ల ప్రక్రియ నిలిచిపోయింది. ఈ స్థలం కొలిక్కి వచ్చే వరకు ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయొద్దని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ కమిషనర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ ఆగస్టు 27వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ సర్వే నం.58 నుంచి 226 వరకు ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయకుండా నిలిపేశారు. రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో 50 పైగా కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు.

అయోమయం.. గందరగోళం

చింతల్ గణేష్‌నగర్ నుంచి మొదలుకొని సూర్యనగర్, ద్వారకానగర్, మాణిక్యనగర్, పద్మానగర్-1,2 ఫేజ్‌లతో పాటు పాపయ్యయాదవ్ నగర్, కల్పన సొసైటీ, చెరుకుపల్లి కాలనీ, వాణి నగర్, ఇంద్ర సింగ్ నగర్, కాకతీయ నగర్, శ్రీనివాస్ నగర్, బాపూనగర్, అంబేద్కర్‌నగర్‌లో పాటు అనేక కాలనీలు సర్వే నెం. 58 నుంచి 226లో మధ్యలో ఉన్నాయి. ఈ వందలాది ఎకరాల స్థలంలో ఇప్పటికే అన్ని చోట్ల పూర్తి నిర్మాణాలు జరిగాయి. తాజాగా వక్ఫ్ బోర్డు స్థలం ఉందని ఉత్తర్వులు రావడం.. ఈ కాలనీల్లో రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ఆ ప్రాంత వాసులు అయోమయానికి గురవుతున్నారు. ఇదే విషయంపై కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ సురేందర్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఉత్తర్వులతోనే రిజిస్ట్రేషన్లు నిలిపేశామన్నారు.

వెంటనే చర్యలు చేపట్టాలి

వక్ఫ్ బోర్డు స్థలం గుర్తించే విషయంలో రెవెన్యూ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని 50 కాలనీల ప్రజలు కోరుతున్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఈ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

సర్వే అనంతరం పునరుద్ధరిస్తాం



ఇప్పటికే ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. వారి ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నాం. ఇటీవల పలు కాలనీలా సంక్షేమ సంఘం ప్రతినిధులు, బిల్డర్లు వచ్చి వినతిపత్రం అందజేశారు. ఇది రెవెన్యూ పరమైన విషయం. వక్ఫ్ సంస్థ స్థల వివరాలను సేకరించాలి. తదుపరి ఉత్తర్వులు రాగానే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఉంటుంది.

– సురేందర్, సబ్ రిజిస్ట్రార్ కుత్బుల్లాపూర్

మేయర్‌కు ఆహ్వానం అందజేత



ఆహ్వానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ 24వ డివిజన్ కార్పొరేటర్ సుజాత ఆధ్వర్యంలో ప్రగతినగర్ బతుకమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం మేయర్ కొలన్ నీలారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా నిర్వహించ తలపెట్టిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వాన పత్రికను అందజేశారు.

28న జాతీయ లోక్ అదాలత్

జగద్గిరిగుట్ట: జాతీయ లోక్ అదాలత్‌ను ఈ నెల 28న నిర్వహించనున్నట్లు సీఐ క్రాంతి కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పంతాలు, పట్టింపులకు పోకుండా భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని రాజీ కుదుర్చుకోవాలని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో స్టేషన్‌కు సంబంధించిన ఏమైనా కేసులు ఉన్నా, పరిష్కారం కోసం ఏవైనా సందేహాలు ఉన్నా పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవచ్చని సీఐ తెలిపారు.

పోస్టర్ పోటీల్లో ప్రథమ బహుమతి



ప్రథమ బహుమతి పొందిన మనస్విత

కుత్బుల్లాపూర్: బేగంపేట్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని, గాజులరామారం డివిజన్ శ్రీరామ్‌నగర్‌కు చెందిన మనస్విత చికిలే ప్రతిభ చూపింది. నగరంలోని కస్తూర్బా గాంధీ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల రజతోత్సవ సంబురాల్లో భాగంగా రాజనీతి శాస్త్రం శాఖ ఆధ్వర్యంలో 'పరిపాలనలో కృత్రిమ మేధా పాత్ర' అనే అంశంపై నిర్వహించిన పోస్టర్ పోటీలో ప్రథమ బహుమతి గెలుచుకుంది.

ముగిసిన సీబీఎస్ఈ పాఠశాలల ఖోఖో టోర్నమెంట్



ట్రోఫీని అందజేస్తున్న వల్లూరిపల్లి రమణ, విజయారాణి

నిజాంపేట్: బాచుపల్లిలోని వల్లూరుపల్లి రత్తయ్య సీతమ్మ విజ్ఞాన జ్యోతి స్కూల్‌లో నాలుగు రోజుల పాటు జరిగిన సీబీఎస్ఈ స్కూల్స్ ఖోఖో టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి స్కూల్ మేనేజ్మెంట్ తరపున ట్రస్టీ వల్లూరుపల్లి రమణ, పాఠశాల డైరెక్టర్ కొడాలి విజయారాణి హాజరై విజేత జట్లకు ట్రోఫీలను అందజేశారు. అండర్-14 బాలుర విభాగంలో అనకాపల్లికి చెందిన శ్రీప్రకాష్ విద్యానికేతన్, నల్గొండకు చెందిన నల్గొండ పబ్లిక్ స్కూల్, ఏలూరుకు చెందిన హీల్స్ పాఠశాల, వరంగల్‌కు చెందిన ఏకశిలా అంతర్జాతీయ పాఠశాల, అండర్-17 బాలుర విభాగంలో తిరుపతికి చెందిన అక్కార్డ్ పాఠశాల, శామీర్‌పేట్‌కు చెందిన శాంతినికేతన్ పాఠశాల, ఖమ్మంకు చెందిన బ్లూమింగ్ మైండ్స్ పాఠశాల, ఎర్రగడ్డకు చెందిన సంస్కార్ స్కూల్, అండర్-19 బాలుర విభాగంలో అనకాలపల్లికి చెందిన శ్రీప్రకాష్ పాఠశాల, రంగారెడ్డి జిల్లాకు చెందిన పార్చ్యూన్ బటర్‌ఫ్లై స్కూల్, ఖమ్మంకు చెందిన హెచ్‌పీ పబ్లిక్ స్కూల్, ఏలూరుకు చెందిన సర్ సీఆర్ రెడ్డి పాఠశాలలు ఉత్తమ ప్రతిభ కనబరిచాయి. అదే విధంగా బాలికల అండర్-14 విభాగంలో ఏలూరు జిల్లా తోటపల్లికి చెందిన హీల్స్ పాఠశాల, నల్గొండకు చెందిన నల్గొండ పాఠశాల, అనాకపల్లికి చెందిన ప్రకాష్ పాఠశాల, కర్నూల్‌కు చెందిన సిస్టర్ స్టానిస్లాస్ పాఠశాల, బాలికల అండర్-17 విభాగంలో బాచుపల్లికి చెందిన వల్లూరుపల్లి రత్తయ్య సీతమ్మ విజ్ఞాన జ్యోతి స్కూల్, గొల్లపల్లికి చెందిన మాంటిస్సోరి స్కూల్, గుంటూరుకు చెందిన విజ్ఞాన్ స్కూల్, కీసరకు చెందిన పల్లవి అంతర్జాతీయ పాఠశాల, బాలికల అండర్-19 విభాగంలో తిరుపతికి చెందిన అక్కార్డ్ పాఠశాల, ఖమ్మంకు చెందిన హార్వెస్ట్ పాఠశాల, అమీర్‌పేట్‌కు చెందిన సిస్టర్ నివేదిత పాఠశాల, ఏలూరుకు చెందిన సర్ సీవీరెడ్డి పాఠశాల జట్లు ఉత్తమ ప్రతిభను కనబరిచాయి. కార్యక్రమంలో వీఎర్ఆర్ కళాశాల పీఈటీ సాయి జి రావు, శ్రీరామ్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పండిట్ దీన్ దయాళ్ సేవలు మరువలేం



ప్రగతినగర్‌లో పండిత్ దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ మహోన్నత వ్యక్తి అని, అతని సేవలు మరువలేం అని బీజేపీ జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి అన్నారు. బుధవారం భారతీయ జనసంఘ్ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ప్రగతినగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యం నుండి అనేక కష్టనష్టాలను ఎదుర్కొని చివరి వరకూ పేద ప్రజల కోసమే పాటు పడిన మహోన్నత వ్యక్తి దీన్‌దయాళ్ అని అన్నారు. కార్యక్రమంలో ప్రగతినగర్ బీజేపీ అధ్యక్షుడు నరేంద్ర చౌదరి, పార్లమెంట్ కో కన్వీనర్ డాక్టర్ ఎమ్.ఆర్.ఎస్.రాజు, నిజాంపేట, బాచుపల్లి అధ్యక్షులు భిక్షపతి యాదవ్, ప్రసాద్ రాజు, నాయకులు దాసి నాగరాజు, సంతోష్ గౌడ్, మైలారం అశోక్, శివ ప్రసాద్, సత్యనారాయణ, గోనె మల్లా రెడ్డి, శిల్పా రెడ్డి, సుమన్ రావ తదితరులు పాల్గొన్నారు.

'రోబోటిక్' ద్వారా మోకాలి ఆపరేషన్

మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్‌లో ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీనటి జయసుధ, హాస్పిటల్ చైర్మన్ సీహెచ్ భద్రారెడ్డి

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం మల్లారెడ్డి నారాయణ రోబోటిక్ సహాయంతో మోకాలి కీలు శస్త్ర చికిత్సలను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీనటి, డాక్టర్ జయసుధ కపూర్, మల్లారెడ్డి హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ సీహెచ్. భద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ సీహెచ్. ప్రీతిరెడ్డి హాజరై వైద్య సంరక్షణ విధానాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్, ఆర్థోపెడిక్ సర్జన్ ఆర్.అంజనీకుమార్ మాట్లాడుతూ.. రోబోటిక్ సర్జరీ కచ్చితత్వాన్ని పెంచుతుందని, సంక్లిష్టతలను తగ్గించడంతో పాటు రోగి కోలుకోవడాన్ని వేగవంతం చేస్తుందన్నారు. అనంతరం సినీనటి జయసుధ మాట్లాడుతూ.. రోగి ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఆరోగ్య సంరక్షణలో ఆవిష్కరణ చాలా ముఖ్యమని, మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్‌లో రోబోటిక్ సర్జరీని ప్రవేశపెట్టడం అనేది గొప్ప అడుగు అని అన్నారు. మల్లారెడ్డి హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ సీహెచ్. భద్రారెడ్డి మాట్లాడుతూ.. టెక్నాలజీ ద్వారా ఆరోగ్య సంరక్షణను అభివృద్ధి చేయడంపై తమ అన్వేషణ కొనసాగుతుందన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ

దుండిగల్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను మున్సిపల్ అధికారులు నిర్వహించారు. ప్లాస్టిక్ బ్యాన్, వాటి వల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టం, తడి, పొడి చెత్తను వేరు చేయడం, పర్యావరణానికి హానికరం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రావు, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ పి.సాత్విక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచందర్, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



అన్నప్రాసనంలో పాల్గొన్న చిన్నారులు, వారి తల్లిదండ్రులు

దుండిగల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకుని గర్భిణులు పండంటి బిడ్డలకు జన్మనివ్వాలని సీడీపీఓ శారద అన్నారు. బుధవారం దుండిగల్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసంలో భాగంగా బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శోభారాణి, రేణుక, శ్యామల, సీహెచ్‌ఓ శ్రీనివాస్, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఉద్యోగులు

నిజాంపేట్: ప్రగతి నగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆల్విన్ సంస్థ మాజీ ఉద్యోగులు బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ సౌజన్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆల్విన్ కాలనీ మాజీ ఉద్యోగులు మాట్లాడుతూ.. ప్రగతినగర్‌లో వర్షం పడితే రోడ్లపై భారీగా వరదనీరు చేరుతోందని, దీంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. దీనికి శాశ్వత పరిష్కార మార్గం చూపాలన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లు ధ్వంసమయ్యాయని, మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నబీ, రమేష్, కృష్ణంరాజు, బల్వంత్‌రెడ్డి, సతీష్‌బాబు, సారయ్య, విజయ్‌కుమార్, సహదేవరావు, వెంకటరాజం, నర్సింహులు, శంకర్‌రావు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



శ్రీనివాసరావు

జగద్గిరిగుట్ట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట పాపిరెడ్డినగర్‌కు చెందిన కొండాడి శ్రీనివాసరావు (73) రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం 11:30 గంటలకు తన స్కూటీ (టీఎస్ 08జేక్యూ 4874)పై బయటకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు శ్రీనివాసరావుకు ఫోన్ చేశారు. స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో స్నేహితులు, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం అతడి కుమారుడు శేఖర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మసిస్టులకు సన్మానం

జగద్గిరిగుట్ట: ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఫార్మసిస్టులను బుధవారం సన్మానించారు. శ్రీనివాస్ నగర్‌కు చెందిన వినయ్ గౌడ్‌ను, ఆల్విన్ కాలనీకి చెందిన శ్రీనివాస్‌ను, చంద్రగిరి నగర్‌కు చెందిన దశరథ్‌ను, పీపీ నగర్‌కు చెందిన ఇమ్రాన్‌లను హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షుడు తుటీ విజయ్ కుమార్ సన్మానించారు. కార్యక్రమంలో సామాజిక వేత్త మధుబాబు పాల్గొన్నారు.

'మనూ'లో నేడు వర్క్‌షాప్

రాయదుర్గం: మనూలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్(ఎంసీజే) ఆధ్వర్యంలో రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గురు, శుక్రవారాల్లో 'మొబైల్ అండ్ డేటా జర్నలిజం-ఎంబ్రేసింగ్ ఇన్నోవేషన్ ఇన్ మీడియా' అనే అంశంపై ఈ వర్క్‌షాప్ కొనసాగుతుంది. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షత వహిస్తారు. కార్యక్రమంలో భారత్‌సమాచార్ యూపీ ఎడిటర్ ఇన్ చీఫ్ బ్రజేష్‌మిశ్రా, బీబీసీ హిందీ ఎడిటర్ నితిన్ శ్రీవాస్తవ, టీజీఎంఆర్ఈఐఎస్ అధ్యక్షుడు ఎండీ ఫహీమ్‌ఖురేషి , పలువురు ప్రొఫెసర్లు పాల్గొంటారు.

జలమండలి కార్యాలయమా..

సామగ్రి డంపింగ్ కేంద్రమా?

- కార్యాలయ ఆవరణలో నిర్మాణ సామగ్రిని డంప్ చేస్తున్న కాంట్రాక్టర్లు
- పట్టించుకోని అధికారులు

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయాన్ని కాంట్రాక్టర్లు నిర్మాణ సామగ్రి డంపింగ్ కేంద్రంగా మార్చుకున్నారు. రంగారెడ్డినగర్ ఏపీహెచ్‌బీ కాలనీలో ఉన్న జలమండలి డివిజనల్ కార్యాలయం ఆవరణ ఎప్పుడు చూసినా మ్యాన్‌హోళ్ల మూతలు, పైపులు దర్శనమిస్తున్నాయి. వీటికి తోడు పనులు చేపట్టడానికి వినియోగించే క్రేన్‌లు, మ్యాన్‌హోళ్ల నుండి వ్యర్థాలను తరలించే వాహనాలను కార్యాలయ ఆవరణలోనే నిలుపుతున్నారు. దీంతో కార్యాలయ ఆవరణలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. జలమండలి ఆధ్వర్యంలో పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు కంకర, డస్ట్, ఇతర వస్తు సామగ్రిని జలమండలి కార్యాలయంలోనే డంప్ చేస్తున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. కాంట్రాక్టర్లు ఆయా ప్రాంతాల్లో చేపట్టే పనులకు వినియోగించే సామగ్రిని డంప్ చేయడానికి ప్రైవేట్ స్థలంలో డంప్ చేయడానికి కొంత మొత్తం అద్దె రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఖర్చుతో కూడుకున్నది కావడంతో జలమండలి కార్యాలయాన్ని అడ్డాగా మార్చుకున్నారు. జలమండలి అధికారులు సైతం కాంట్రాక్టర్లతో ఉన్న సంబంధాల నేపథ్యంలో పట్టించుకోవడం లేదు. దీంతో ఆవరణ అపరిశుభ్ర వాతావరణాన్ని తలపిస్తోంది.



కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయ ఆవరణలో డంప్ చేసిన వస్తు సామగ్రి

వృద్ధుల దినోత్సవ వారోత్సవాలు 2 వరకు

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గాంధీ జయంతి రోజైన అక్టోబర్ 2 వరకు వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం.కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. సీనియర్ సిటిజన్‌లతో ఆయన ప్రతిజ్ఞ చేయించి, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ... ఈ నెల 26 న వృద్ధాశ్రమాలలోని వయోవృద్ధుల క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న వాకథాన్, 28న తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టం, ఆరోగ్య సంరక్షణపై అవగాహన సమావేశాలు నిర్వహిస్తామన్నారు. 29న పంచాయతీ సెక్రటరీలకు తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టం అవగాహన కార్యక్రమాలతోపాటు ఎల్డర్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 14567పై సదస్సు ఏర్పాటు చేస్తామన్నారు. 30న అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహిస్తామన్నారు. అక్టోబర్ 1, 2వ తేదీల్లో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. జిల్లా విద్యా అధికారి విజయకుమారి, జిల్లా వైద్యఆరోగ్య అధికారి డాక్టరు రఘునాథ్‌స్వామి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాంబశివరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి పద్మ, జిల్లా వయోవృద్ధుల కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.